క్లుప్తంగా

చిన్నారి వైద్యానికి భరోసా


ఎల్‌ఓసీ అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్‌): మండలంలోని దుద్దెడకు చెందిన చిలుముల నర్సింలు కూతురు వైష్ణవి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయాన్ని బీఆర్‌ఎస్‌ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్‌ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి గురువారం సాయంత్రం వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేశారు. వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం నుంచి అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

‘ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోండి’


మాట్లాడుతున్న నాయకులు

మద్దూరు(హుస్నాబాద్‌): మండలంలోని రేబర్తిలో నిరుపేదలకు పంపిణీ చేసిన ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ నాంపల్లి నవిత చంద్రశేఖర్‌, మాజీ ఎంపీపీ బెల్లపు యాదయ్య కోరారు. శుక్రవారం ప్రభుత్వం పంపిణీ చేసిన భూమిని పరిశీలించి మాట్లాడారు. 40 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన కర్రెడ్ల శ్రీధర్‌రెడ్డి పూర్వీకుల నుంచి ప్రభుత్వం 27 ఎకరాలను కొనుగోలు చేసి నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం పట్టాలు అందజేసిందన్నారు. అయితే ఆ భూమి తన పేరుపై ఉందని శ్రీధర్‌రెడ్డి ఇళ్లను కూల్చేస్తానని బెదిరిస్తున్నాడని వాపోయారు. ఈవిషయమై తహసీల్దార్‌కు సైతం ఫిర్యాదు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ డాకూరి లక్ష్మీవెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ అందె భూపతి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణలో విఫలం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉద్యోగ నియామకపు పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి అజ్జు యాదవ్‌ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ నిరుద్యోగ యువకులతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పేందుకు అన్నివర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

వాలీబాల్‌ పోటీల్లో సత్తా


క్రీడాకారులతో ఉపాధ్యాయులు

తొగుట(దుబ్బాక): ఎస్‌జీఎఫ్‌ జిల్లాస్థాయి వాలీబాల్‌ పోటీలో తొగుట బాలుర జట్టు ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచింది. సిద్దిపేటలో శుక్రవారం నిర్వహించిన అండర్‌–14 విభాగంలో తొగుట జట్టు గజ్వేల్‌తో తలపడింది. ఈసందర్భంగా ఎంఈఓ యాదవరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.

కౌన్సిల్‌ సమావేశం బహిష్కరణ


మాట్లాడుతున్న కౌన్సిల్‌ సభ్యులు

చేర్యాల(సిద్దిపేట): స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్‌ అంకుగారి స్వరూపరాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కౌన్సిల్‌ సమావేశాన్ని సభ్యులు బహిష్కరించారు. ఈసందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. గతేడాది కాలంగా కౌన్సిల్‌ సమావేశాల్లో లేవనెత్తిన సమస్యలు, తదితర అంశాలపై పలుమార్లు ఏకగ్రీవ తీర్మానాలు చేసినా నేటికీ అమలుకావడం లేదని వాపోయారు. కౌన్సిల్‌ సభ్యులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. అలాగే కమిషనర్‌ చైర్‌పర్సన్‌ వ్యవహార శైలి కూడా సభ్యులకు వ్యతిరేకంగా ఉందని నిరసన వ్యక్తం చేశారు. బహిష్కరించిన వారిలో అధికార బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ సభ్యులతో పాటు వైస్‌ చైర్మన్‌ ఉన్నారు.

నివాళి

సిద్దిపేటఎడ్యుకేషన్‌: హరిత విప్లవ పితామహుడు ఎంఎస్‌ స్వామినాథన్‌కు శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర, జీవసాంకేతిక విభాగాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్‌ రాణి, అధ్యాపకులు డాక్టర్‌ శైలజ, మిరాజ్‌ ఫాతిమా, బీఎస్సీ, బీజెడ్‌సీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టినిద్దాం.. స్ఫూర్తి నింపుదాం



చేర్యాల: మట్టిని సేకరిస్తున్న పోస్టల్‌ సిబ్బంది


ప్రతిజ్ఞ చేస్తున్న అక్కన్నపేట కేజీబీవీ బాలికల పాఠశాల విద్యార్థినులు

ఆజాదీకా అమృత్‌ మహోత్సవంలో భాగంగా ‘మేరీ మిట్టీ.. మేరా దేశ్‌ కార్యక్రమం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గ్రామాల్లో ర్యాలీలు, పంచ ప్రాణ ప్రతిజ్ఞ నిర్వహించారు. పలు నివాస గృహాల నుంచి మట్టిని అమృత కలశంలో సేకరించి పోస్టుమాస్టర్లకు అందించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చేర్యాల మండల పరిధిలోని ఆకునూరులో హన్మకొండ పోస్టల్‌ సూపరింటెండెంట్‌ హనుమంతు ఆధ్వర్యంలో మట్టిని సేకరించారు.


బెజ్జంకి మోడల్‌ స్కూల్‌లో..


ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): కొమురవెల్లిలో మట్టిని సేకరిస్తున్న విద్యార్థులు

సమన్వయంతో పనిచేద్దాం

మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల


మాట్లాడుతున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల

సిద్దిపేటజోన్‌: బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా బల్దియా, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల సూచించారు. శుక్రవారం మున్సిపల్‌ సమావేశ మందిరంలో కౌన్సిల్‌ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోమటిచెరువు, ఇతర చెరువుల్లో మహిళలు బతుకమ్మలను నిమజ్జనం చేసే అవకాశం ఉంటుందని, చెరువుల్లో చెత్తా చెదారం తొలగించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు కొందరు కౌన్సిలర్లు పట్టణంలో ఆయా వార్డుల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో శిలాఫలకంపై ప్రజాప్రతినిధులు పేర్లు పెట్టడం లేదని వాపోయారు. అదేవిధంగా ఆయా వార్డుల్లో యూజీడీ సమస్యలు కౌన్సిల్‌ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని సత్వరం పరిష్కరించాలని చైర్‌పర్సన్‌ ఆదేశించారు. అనంతరం 30 అంశాల ఎజెండాను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ కనకరాజు, కమిషనర్‌ సంపత్‌ కుమార్‌, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణం మేలు

గజ్వేల్‌రూరల్‌: డ్రైవర్లు తమ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ట్రాఫిక్‌ సీఐ తిరుపతి పేర్కొన్నారు. గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని సేయింట్‌ మేరీస్‌ విద్యానికేతన్‌లో శుక్రవారం డ్రైవర్లకు డ్రంకెన్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి డ్రైవర్‌ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, బస్సుకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్‌ లైసెన్స్‌ వెంటబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ రాయప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

చలో అక్బర్‌పేటను విజయవంతం చేయండి

తొగుట(దుబ్బాక): దుబ్బాక మాదిగ రాజకీయ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన నిర్వహించే చలో అక్బర్‌పేట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేదిక కన్వీనర్‌ గుర్రాల శ్రీనివాస్‌ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కో కన్వీనర్‌ డప్పు శివరాజు, మండల కన్వీనర్‌ బొంబాయి వెంకట్‌, నాయకులు నర్సింలు, కృష్ణ, బాల్‌రాజు, ఎల్లం, యాదగిరి, మహేష్‌, రాజయ్య పాల్గొన్నారు.

సన్మానం


శ్రీహరియాదవ్‌ను సన్మానిస్తున్న అధికారులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): ఉమ్మడి మెదక్‌ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్‌ అధ్యక్షుడిగా రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీహరియాదవ్‌ను శుక్రవారం జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జాయింట్‌ డైరెక్టర్‌ జగత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు అభినందనలు తెలిపి సన్మానించారు.

దివ్యాంగులకు పెద్దపీట

దౌల్తాబాద్‌(దుబ్బాక): రాష్ట్రంలో దివ్యాంగులకు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జెడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. మండల పరిధిలోని తిర్మలాపూర్‌ గ్రామ వికలాంగుడు శివంది నర్సింహులుకు ఎంపీపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సొంత డబ్బులతో కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండారు దేవేందర్‌, బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి


హుస్నాబాద్‌: ఆశావర్కర్ల మానవహారం

దుబ్బాకటౌన్‌: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ, ఆశవర్కర్లు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆశావర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షురాలు మంజులు, అంగన్‌వాడీ యూనియన్‌ జిల్లా కోశాధికారి పద్మ అన్నారు. శుక్రవారం దుబ్బాక తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ఆశాలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కర్‌, నాగరాణి, బాలలక్ష్మీ పాల్గొన్నారు.

హుస్నాబాద్‌: ఆశావర్కర్ల సమ్మెలో భాగంగా హుస్నాబాద్‌, అక్కన్నపేట మండలాల ఆశావర్కర్స్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట దీక్షా శిబిరం ఏర్పాటు చేసి మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు రాజు నాయక్‌, అనిల్‌ కుమార్‌, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్‌ వేతనం చెల్లించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు రూ.18 వేల ఫిక్స్‌డ్‌ వేతనం చెల్లించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు మద్దెల అంజయ్య డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు బాలమణి, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణేశ్‌ శోభాయాత్ర

కార్లపై వినాయక శోభాయాత్ర



దుబ్బాకలో వినాయక శోభాయాత్ర వైభవంగా కొనసాగింది. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా యువకులు రెండు అడుగుల మట్టి వినాయకులను పూజించారు. నిమజ్జనం సందర్భంగా శుక్రవారం కార్లపై ఊరేగింపు చేపట్టారు. – దుబ్బాక

వ్యవసాయ రంగానికి పెద్దపీట


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్‌ శ్రీనివాస్‌

గజ్వేల్‌రూరల్‌: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుందని గజ్వేల్‌ ఏఎంసీ చైర్మన్‌ మాదాసు శ్రీనివాస్‌ అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధునాతన హంగులతో వ్యవసాయ మార్కెట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ను ప్రభుత్వం నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. అదేవిధంగా పత్తి సాగు చేసే రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని రింగురోడ్డు సమీపంలో కాటన్‌ మార్కెట్‌ను నిర్మించిందన్నారు. దీనిని అక్టోబర్‌ 3న మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌ సెక్రటరీ జాన్‌వెస్లీ, ఏఎంసీ వైస్‌చైర్మన్‌ ఉపేందర్‌రెడ్డి, డైరెక్టర్లు భాస్కర్‌రెడ్డి, నర్సింలు, యాదగిరి, బాలకిషన్‌, మతిన్‌, ప్రవీణ్‌, రూబెన్‌, నాయకులు సాయిరెడ్డి, రమేష్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి


హోటల్‌లో వంట తీరును పరిశీలిస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రజిత తదితరులు

హుస్నాబాద్‌: వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఆకుల రజిత హోటళ్ల నిర్వాహకులకు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని హోటళ్లలో స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిగిలిపోయిన ఆహారాన్ని మున్సిపల్‌ సిబ్బందికి అందజేయాలన్నారు. ప్లాస్టిక్‌ కవర్లు వాడొద్దని.. తడి చెత్తతో ఎరువు తయారు చేయాలని పేర్కొన్నారు. టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్‌పర్సన్‌ అయిలేని అనిత, కౌన్సిలర్‌ స్వర్ణలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ బాల ఎల్లం, అధికారులు, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


గౌరారంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వర్గల్‌(గజ్వేల్‌): చిరుధాన్యాలు పోషక సంపన్నమని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ రాణి అన్నారు. శుక్రవారం మండలంలోని గౌరారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే సామలు, అరికెలు, జొన్నలు, రాగులు తదితర చిరుధాన్యాలు గర్భిణులు, కిశోర బాలికల ఆరోగ్యానికి బాసటగా నిలుస్తాయన్నారు. వీటిని రోజువారీ భోజనంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రామలీల, సంతోష, సర్పంచ్‌ వినోద నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మజీద్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో ఎంపీపీ లతా రమేష్‌గౌడ్‌, సర్పంచ్‌ లత శివరాములు, సూపర్‌వైజర్‌ సునీత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు మంచి రోజులు


చేప పిల్లలను వదులుతున్న నాయకులు

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్‌ అన్నారు. శుక్రవారం మండలంలోని మునిగడప, ఇటిక్యాల గ్రామాల చెరువుల్లో చేప పిల్లలను వదిలారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో మత్స్యకారులకు మంచి రోజులు వచ్చాయని తెలిపారు. ఉచితంగా చేప పిల్లలతో చేతి నిండా ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చంద్రశేఖర్‌, బాలలక్ష్మీ, భిక్షపతి, మంజుల, రాజేశ్వరి, నాయకులు మల్లేశం, రవి, పరమేశ్వర్‌, బాబు, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించి ఈప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేర్చాలని బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జేఏసీ నాయకులు, పలు రాజకీయ పార్టీల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు సురేందర్‌, లక్ష్మారెడ్డి, శశిధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రమేష్‌, శ్రీనివాస్‌, రామకోటి, సంపత్‌ ఉన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

చేర్యాల(సిద్దిపేట): అరెస్టులతో రెవెన్యూ డివిజన్‌ ఉద్యమాన్ని ఆపలేరని జేఏసీ నాయకులు అన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్‌ ఏర్పాటు చే యాలని కోరుతూ శుక్రవారం సడక్‌ బంద్‌కు పిలుపునివ్వగా పోలీసులు జేఏసీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. రాస్తారోకోలో పాల్గొన్న నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. డివిజన్‌ సాధన కోసం ఉద్యమాలు చేస్తున్న జేఏసీ నాయకులను అక్రమంగా అరెస్ట్‌ చేయడం సరికాదని పేర్కొన్నారు.


రాస్తారోకో చేస్తున్న జేఏసీ, అఖిలపక్ష నాయకులు

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

దుబ్బాక: కొడుకును గురుకుల వసతి గృహంలో చేర్చి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ఆగి ఉన్న ట్రాలీ ఆటోను ఢీకొని భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట మండలం బోనాల కొండాపూర్‌కు చెందిన రవి, నాగరాణి దంపతులు శుక్రవారం తమ కొడుకును దుబ్బాక గురుకుల వసతి గృహంలో చేర్పించి ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి పయనమయ్యారు. మున్సిపల్‌ పరిధిలోని దేశాయి బీడీ కంపెనీ సమీపంలో ఆగి ఉన్న ట్రాలీ ఆటోను వారి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో వారు వెంటనే అక్కడికి చేరుకుని క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త వార్తలు

◆ **అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు**

మద్దూరు(హుస్నాబాద్‌): అరెస్టులతో చేర్యాల రెవెన్యూ డివిజన్‌ సాధన ఉద్యమాన్ని ఆపలేరని జేఏసీ నాయకులు అన్నారు. సడక్‌ బంద్‌ కార్యక్రమానికి వెళ్లకుండా జేఏసీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బెక్కల్‌ సర్పంచ్‌ కూకట్ల బాలరాజుయాదవ్‌, మహేందర్‌, భాస్కర్‌, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఖాతాదారులకు అవగాహన**

బెజ్జంకి(సిద్దిపేట): డిజిటల్‌ లావాదేవీలపై తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ అనిల్‌ ఖాతాదారులకు అవగాహన కల్పించారు. బెజ్జంకిలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత సమావేశం నిర్వహించగా.. కళాకారులు తమ పాటల ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు, వ్యాపారాలకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు.

◆ **సామూహిక సత్యనారాయణ వ్రతాలు**

హుస్నాబాద్‌రూరల్‌: మండలంలోని పొట్లపల్లి సీతారామాలయంలో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ దంపతులు దేవసాని నిర్మల నర్సింహారెడ్డి, కానుగుల లక్ష్మీమోహన్‌, జగదీశ్వరచారి, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఉచిత వైద్య శిబిరం**

కొండపాక(గజ్వేల్‌): మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో మేడ్చల్‌ మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. 100 మంది పరీక్షలు చేసుకోగా 35 మందికి మెరుగైన వైద్య చికిత్స కోసం రెఫర్‌ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సర్పంచ్‌ మల్లమారి రవీందర్‌, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు**

హుస్నాబాద్‌: పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయంలో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అనివేటి మం



డపం పనులు ప్రారంభించారు. ఇప్పటికే మండప నిర్మాణానికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి కిషన్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్‌ పూదరి లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

◆ **ఎంఐఎం దిష్టిబొమ్మ దహనం**

హుస్నాబాద్‌: పట్టణంలోని అంబేద్కర్‌ చౌరస్తాలో శుక్రవారం రాత్రి బీజేపీ నాయకులు ఎంఐఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. బండి సంజయ్‌ కార్యాలయంపై దాడికి యత్నించడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, భీమేశ్వర్‌, శ్రీనివాస్‌, రాజేందర్‌, సంపత్‌ నాయక్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ **అక్టోబర్‌ 1న సామూహిక శ్రమదానం**

సిద్దిపేటజోన్‌: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా అక్టోబర్‌ 1న సామూహిక శ్రమదానం నిర్వహిస్తున్నామని మున్సిపల్‌ కమిషనర్‌ సంపత్‌ కుమార్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్‌ పేదలకు వరం**

కొండపాక(గజ్వేల్‌): సీఎంఆర్‌ఎఫ్‌ పేదలకు వరమని రైతు బంధు సమితీ మండల కోర్డినేటర్‌ ర్యాగల్ల దుర్గయ్య అన్నారు. మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లికి చెందిన పలువురికి శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను పంపిణీ చేశారు.

◆ **ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలి**

నంగునూరు(సిద్దిపేట): జనాభా ప్రకారం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగలకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని ఎమ్మార్పీఎస్‌ టీఎస్‌ అధికార ప్రతినిధి దేవులపల్లి రాజేందర్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం నంగునూరులో ఆయన మాట్లాడుతూ.. సీట్లు కేటాయించకుంటే మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

◆ **నూతన కార్యవర్గం**

సిద్దిపేటఅర్బన్‌: మండలంలోని ఎన్సాన్‌పల్లి గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొల్గం రాములుగౌడ్‌, డైరెక్టర్లుగా అంబటి సత్యనారాయణగౌడ్‌, బాలగౌడ్‌, నాగుల చంద్రమౌళిగౌడ్‌, నాగుల రామస్వామిగౌడ్‌ ఎన్నికయ్యారు.

◆ **ముస్లింల ప్రార్థనలు**

హుస్నాబాద్‌: మిలాద్‌ ఉన్‌ నబీ పురస్కరించుకొని పట్టణంలోని జామా మసీద్‌ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మత గురువు రుహుల్‌ అమిన్‌ ప్రవక్త సందేశాన్ని వినిపించారు.